క్లుప్తంగా

ఆలయ పునరుద్ధరణకు భూమిపూజ



దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తిలో హనుమాన్ ఆలయ పునరుద్ధరణకు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ మేరకు.. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు వేద మంత్రాల మధ్య భూమిపూజ చేశారు. గ్రామస్తులు, పెద్దలు ఇతర గ్రామాల దాతల సహకారంతో ఆలయ పునరుద్ధరణ చేపట్టనున్నట్లు తెలిపారు. పురాతన మందిరం స్థానంలో అత్యంత శోభాయామనంగా ఆలయనిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు. స్వచ్ఛందంగా దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు యువకులు భక్తులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



మద్దూరు: మండలంలోని దోరేపల్లి నర్సరీని శుక్రవారం ఎంపీడీఓ జయరాములు పరిశీలించారు. వర్షకాలం నాటికి మొక్కలు ఏపుగా పెంచాలని ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. ఈ నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలోని నర్సరీలను వేసవికాలంలో జాగ్రత్తగా పెంచాలని సూచించారు. ఎంపీడీఓతోపాటు ఉపాధి ఏపీఓ సిద్దేశ్వర్ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా సూచిక బోర్డు



మాగనూర్: మండలంలోని పూంజనూర్ గ్రామానికి వెళ్లే దారికి గేటు వద్ద ఏర్పాటుచేసిన సూచిక బోర్డుపై ఎటువంటి పేర్లునమోదు చేయకపోవడంపై ఇటుగా కొత్తగా వస్తున్న వారికి ఇబ్బందికరంగా మారింది. పూంజనూర్ గ్రామానికి మూడుమాల్, కొల్పూర్ నుంచి వచ్చే ప్రజలకు సరైన సూచికబోర్డు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఈ దారి గుండా వెళ్లేవారు ఏ గ్రామానికి ఎటు వెళ్లాలనేది ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు స్పందించి సూచిక బోర్డుపై గ్రామం పేరు రాయించాలని కోరుతున్నారు.

ఇంటింటా బీజేపీ నాయకుల ప్రచారం



మరికల్: బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే. అరుణ విజయం కోసం అప్పంపల్లి గ్రామ బీజేపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే. అరుణమ్మను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేస్తున్నామని తెలిపారు. అలాగే మండల కేంద్రంతోపాటు ఎలిగండ్ల, పెద్దచింతకుంట, తీలేర్ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి విరాళం



నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్, కొత్తపల్లి, ఎల్లంపల్లి గ్రామాల ఇలవేల్పు గ్రామ దేవత గజ్జలమ్మ అవ్వ పాత విగ్రహాలను ఉంచేందుకు షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణానికి ఆయా గ్రామాల అర్చకులు జనార్దనచారి విరాళంగా రూ. 20వేలు అందించారు. ఈ నెల 30న, నిర్వహించే గజ్జలమ్మ అవ్వ జాతర ఉత్సవాలకు ముందస్తుగానే ఈ నిర్మాణ పనులు పూర్తి చేయించారు. విరాళం అందించిన జనార్ధనాచారిని గ్రామ ప్రజలు అభినందించారు.

'అమ్మ'కు బడి బాధ్యతలు

- ఎస్ఎంసీల స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలు
- కమిటీ చైర్మన్‌లుగా గ్రామ సంఘం అధ్యక్షుల ఎంపిక
- సభ్యులుగా తరగతికి ముగ్గురు మహిళలు
- మండలంలోని 47 పాఠశాలల్లో కమిటీలు పూర్తి



దామరగిద్ద జీపీఎస్‌లో ఎంపికైన అమ్మ ఆదర్శ కమిటీతో హెచ్ఎం

దామరగిద్ద: ప్రతి బిడ్డకు తొలిగురువు అమ్మ. అలాంటి అమ్మకు ప్రభుత్వ బడుల్లోనూ బాధ్యత కల్పిస్తూ పాఠశాలల్లో కొనసాగుతున్న ఎస్ఎంసీ కమిటీల స్థానంలో రెండేళ్ల కాలపరిమితికి అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలికి (వీఓకు) బడి బాధ్యతలు ఇచ్చింది. ఇందులో భాగంగా పాఠశాలలలో గత కొద్దిరోజుల క్రితం కాలపరిమితి ముగిసిన ఎస్ఎంసీ కమిటీల స్థానంలో కొత్తగా అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశారు. మండలంలోని మొత్తం ఆరు జెడ్పీపరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, 11ప్రాథమికొన్నత పాఠశాలలు, 29 ప్రాథమిక పాఠశాలల్లో ఆయా గ్రామ సమాఖ్య అధ్యక్షులను అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌లుగా ఎంపిక చేస్తూ ప్రభుత్వం డీఆర్‌డీఏ ద్వారా ఆయా గ్రామ పాఠశాలలకు చైర్మన్‌లుగా ఎంపిక చేసిన గ్రామ సమాఖ్య అధ్యక్షుల లిస్టును ఎమ్మార్సీలకు అందించింది. డీఆర్‌డీఏ అందించిన లిస్ట్ ఆధారంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌ల సమక్షంలో తరగతికి ఇద్దరు చొప్పున వివిధ మహిళ సంఘాల సభ్యులను ఎన్నుకున్నారు.

కమిటీ విధులు– బాధ్యతలు

ఆయా పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌గా గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, కన్వీనర్‌గా సదరు పాఠశాల హెచ్ఎంలు వ్యవహరిస్తారు. ప్రతి తరగతి నుంచి ఇద్దరు లేదా ముగ్గురిని కమిటీ సభ్యులుగా మహిళ సంఘాల సభ్యులతో ఎంపిక చేసిన కమిటీ ప్రధానంగా పాఠశాలలో విద్యా అభివృద్ధికి, పాఠశాలల నిర్వహణ, పర్యవేక్షణ బడులను బలోపేతం చేయడం, తాగునీటి సౌకర్యం, బడుల మరమ్మతులు మరుగుదొడ్ల నిర్మాణం, పనరుద్ధరణ పనులు, గదుల విద్యుద్దీకరణ, విద్యార్థులకు యూనిఫాం కుట్టించడం, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల ఇతర సిబ్బంది హాజరు పర్యవేక్షణ బాధ్యతలను నిర్వహిస్తారు. అప్పటికే ఆయా పాఠశాలల ఆదర్శకమిటీల చైర్మన్, కన్వీనర్ (హెచ్ఎం) పేరున జాయింట్ అకౌంట్‌లు ఓపెన్‌చేసి కమిటీల నిర్వహణను ప్రారంభించారు.

కమిటీల ఎంపిక పూర్తిచేశాం..

మండలంలోని అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలపై ఉన్నతాధికారులు అందించిన సూచనల మేరకు కమిటీల ఎంపిక ప్రక్రియ పూర్తిచేశాం. చైర్మన్‌లతోపాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు కన్వీనర్‌లుగా వ్యవహరిస్తుండటంతో ఇద్దరి పేర్లతో జాయింట్ అకౌంట్‌లను తెరిపించాం. పాఠశాలలో చేపట్టే అభివృద్ధి పనులు కమిటీల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

– గోపాల్ నాయక్,
ఎంఈఓ, దామరగిద్ద

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు



ఓటువేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: జిల్లా అభివృద్ధికి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించిన విధంగానే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం హస్తం గుర్తుకు ఓటేసి ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి ఓటర్లను కోరారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి సతీమణి అశ్లేషారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించినట్టే, పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా నెరవేర్చడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లాలోని రైతులకు లక్ష ఎకరాలకు సాగునీరందించేందుకు గాను 69 జీఓను అమలు చేస్తూ నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి ఆడబిడ్డకు సంవత్సరానికి లక్ష రూపాయలు, అందించడమే కాకుండా ఆరు గ్యారంటీ పథకాల ద్వారా బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పుర కౌన్సిలర్ ఎండీ సలీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి. సుధాకర్, యూత్ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, మనోహర్‌ప్రసాద్‌గౌడ్, సరాఫ్ నాగరాజు, డా. సాయిబాబు, బోయ శరణప్ప, రఘు, కౌన్సిలర్లు మహేష్, అమీరుద్దీన్, వినోద్, మారుతీ, బోయ రమేష్, మహిమూద్ ఖురేషి, అనిల్, ఎరుకలి వెంకట్రాములు, బండి ఆనంద్, పవన్ పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి ప్రోత్సాహకాలు

మక్తల్: మండలంలో నమోదైన పలు కేసుల పురోగతి, నేరస్తులను పట్టుకోవడం, న్యాయస్థానాల్లో శిక్షలు పడటానికి కృషిచేస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, సిబ్బంది కబీర్‌లకు శుక్రవారం ఎస్పీ యోగేష్ గౌతమ్ రివార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వర్తించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. పోలీసులను ఆశ్రయించే బాధితులకు భరోసా కల్పించేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు.

నర్వ: పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు కేసులలో నేరం చేసిన నేరస్తులకు శిక్ష పడటంలో పనిచేసిన పోలీస్ సిబ్బందికి శుక్రవారం ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించి రివార్డు అందించారు. ఈ మేరకు.. ఎస్ఐ కురుమయ్య, కోర్టు డ్యూటీ ఆఫీసర్ వేణుగోపాల్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు అందించనట్లు వారు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు బాధ్యయుతంగా పోలీస్ సిబ్బంది పనిచేయాలని ఎస్పీ సూచించినట్లు వారు తెలిపారు.

కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూర్: మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పాలమూరు ఎంపీ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రచారం జోరుగా కొనసాగుతుంది. శుక్రవారం మండల పరిధిలోని పర్మన్‌దొడ్డిలో హర్‌ఘావ్-ఏక్ గంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపుదిశగా అడుగులు ఏ విధంగా వేయాలనే అంశాలపై ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అనంతరం గ్రామాల పరిధిలోని ప్రధానమైన సమస్యలను గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, రవికుమార్ యాదవ్, శివరాంరెడ్డి, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డిని ఓటువేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. వాటి పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లక్ష్మయ్యగౌడ్, రహీమాన్‌ఖాన్, ఆనంద్‌గౌడ్, నరేందర్, సురేందర్, నర్సింహులు, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో భవానిమాత ఆలయంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభయ్యాయి. ఈ మేరకు.. అమ్మవారికి అష్టోత్తర కళాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి 108 కళశాలతో మహిళలు, బాలికలు శోభాయాత్రగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తిసంకీర్తనలు, భజనలతో ఊరేగింపు అమ్మవారి నామస్మరణతో సాగింది. అనంతరం ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చన, పుష్పాలంకరణ, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కుంకుమార్చన చేశారు. అంతకుముందు భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భజన మండలి, మహిళలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



కొల్లంపల్లి మాట్లాడుతున్న వెంకట్రాములు

నారాయణపేట రూరల్ : జాతీయ ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు వెంకట్రాములు డిమాండ్‌చేశారు. మండలంలోని కొల్లంపల్లి, అంత్వార్, అయ్యవారిపల్లి, లింగంపల్లి, బొమ్మన్‌పాడు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రాంతాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ 200రోజులు పని కల్పించాలని, రోజువారి కూలీని రూ.600కి పెంచాలని డిమాండ్ చేశారు. వేసవిలో ఎండలు మండిపోతున్న కనీస సౌకర్యాలు కల్పించలేదని, నీడకోసం టెంట్లు, తాగునీరు అందించాలన్నారు. పని ప్రదేశంలో మృతిచెందిన కూలీలకు రూ.10లక్షల భీమా అందించాలన్నారు.ప్రశాంత్, హాజి, బాలు, వడెప్ప, నర్సింహులు, రాములు, పద్మమ్మ, వెంకటమ్మ, పరుశురాం పాల్గొన్నారు.

ముళ్ల పొదలకు నిప్పు..



మంటలకు కాలిపోయిన ముళ్లపొదలు

నారాయణపేట రూరల్: ఖాళీ ప్రదేశంలో పెరిగిన ముళ్లపొదలకు నిప్పు అంటుకున్న సంఘటనలో పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలోని నిల్వ ఉంచిన గడ్డి తగలబడకుండా ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణ శివారులోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గతకొన్ని సంవత్సరాల క్రితం ప్లాట్లు చేసి విక్రయించారు. అయితే వాటిపై యజమానుల పర్యవేక్షణ లేక బీడుపడి ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. ఈ క్రమంలో శుక్రవారం సైతం గుర్తుతెలియని వ్యక్తులు ఆ ప్రదేశానికి వచ్చిన సమయంలో బీడీ కాల్చిన క్రమంలో ఎండినగడ్డి, ముళ్లపొదలకు నిప్పు అంటుకోవడంతో సుమారు అర కిలోమీటర్‌పైగా మంట వ్యాప్తి చెందింది. అటుగా వెళ్తున్న వారు ఫైర్ సర్వీసెస్‌కు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటు ఆర్పడంలో కొంత తాత్సారం చేశారు. నిప్పు అంటుకున్న ప్రదేశానికి ఒకవైపు వ్యవసాయ పొలంలో వరిపంట ఉండగా, మరోవైపు రైతులు తమ వ్యవసాయ పొలంలో గడ్డివాము నిల్వచేశారు. వాటికి మంటు వ్యాప్తి చెందుతున్న సమయంలో ఫైర్ సిబ్బందితో కొంత వాగ్వివాదానికి దిగడంతో వారు వాహనాన్ని సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వరకు తీసుకొచ్చి పైపుల ద్వారా నీటీని పోస్తూ మంటలు ఆర్పివేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనలో రూ.5వేల నష్టం జరిగినట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ సాయినాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదుగంటల నుంచి ఆరుగంటల వరకు జంగల్ కటింగ్ చేపడుతున్నామని, విద్యుత్ స్తంభాలు, తీగలకు అడ్డంగా పెరిగిన చెట్టుకొమ్మలను తొలగిస్తున్నందున కరెంట్ కోత ఉంటుందన్నారు. వినియోగదారులు, వ్యాపారులు, రైతులు సహకరించాలన్నారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

నర్వ: నేడు మండల కేంద్రంలో ఉదయం 9 గంటలకు మండల బీజేపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా గద్వాల మాజీ ఎమ్మెల్యే భరత్‌సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, మక్తల్ ఇన్‌చార్జి బాల్‌రెడ్డి హాజరవుతున్నార న్నారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేద్దామన్నారు.

వైద్యాధికారిగా కీర్తి

ధన్వాడ: మండల వైద్యాధికారిగా కడం కీర్తిని నియమించినట్లు ఎంపీహెచ్ఈఓ కథలప్ప తెలిపారు. ధన్వాడకు చెందిన కీర్తి ఇక్కడే విధుల్లో చేరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందిస్తానని ఆమె తెలిపారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి



నర్వ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి నియమితులైనట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తనకు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. నర్వకు చెందిన బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డికి రాష్ట్ర స్థాయిలో బీజేపీ సముచిత స్థానం కల్పించినందుకు మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డిని అభినందించారు.

విద్యార్థులకు అభినందన

నారాయణపేట రూరల్: ఇంటర్‌లో చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం స్థానిక సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అభినందించారు. పట్టణానికి చెందిన బోయ లహరిక, పోషల్ అనన్య, మహతిశ్రీ ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470మార్కులకు 467సాధించడంపై శాలువా కప్పి పూలబొకె అందించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. చక్కటి లక్ష్యాన్ని కల్గి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. బండివేణు, కోట్ల రవిందర్‌రెడ్డి, సలీం, వెంకుగౌడ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ఆత్మకూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గాంధీచౌక్, చెరువుకట్ట వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. నగదుకు సంబంధించిన పూర్తిస్థాయి ధృవపత్రాలు ఉండాలని, ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ఎన్నికల నియమావళిని పాటించాలని కోరారు.



వైభవంగా మునిరంగస్వామి విగ్రహా ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించిన మునిరంగస్వామి విగ్రహం



పూజలు చేస్తున్న భక్తులు

మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నంలో మునిరంగస్వామి విగ్రహా ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు చేసి మునిరంగస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదలతో అన్నదానం నిర్వహించారు. ఈ విగ్రహా ప్రతిష్ఠాపనలో భాగంగా ఈ నెల 27న ఎద్దులబండి గిరక పోటీలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

కొనసాగుతున్న మునిరంగస్వామి జాతర

అమరచింత: మండలంలోని నందిమళ్లలో వెలసిన చింతల మునిరంగస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వివిధ గ్రామాల ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయంలో కొలువుదీరిన స్వామివారికి పోటేళ్లను బలిచ్చి పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకుంటున్నారు. గురువారం అర్ధరాత్ర స్వామివారి ప్రభోత్సవం కనులపండువగా కొనసాగింది. టీపీసీసీ కల్లుగీత కార్మిక డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ ఆలయంలో పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పాలమూరుకు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు



పాలమూరుకు తరలి వెళ్తున్న నాయకులు

నారాయణపేట: మహబూబ్‌నగర్‌లో జరిగే బీఆర్ఎస్ కేసీఆర్ బస్సు యాత్రకు శుక్రవారం పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయ్‌సాగర్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఊపి ప్రత్యేక వాహనాల్లో కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో పట్టణ మైనార్టీ అధ్యక్షుడు మహమూద్ అన్సారి, సీనియర్ నాయకులు గందె చంద్రకాంత్, చెన్నారెడ్డి, బసపురం వెంకట్, దేవరాజ్, సిద్ధం లక్ష్మణ్, వీరేష్, శేఖర్ ఉన్నారు.

మరికల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని వారు కోరారు. శేఖర్, జగదీష్, రాములు, బసంత్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మహబూబ్‌నగర్ పట్టణంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ రోడ్‌షో కార్యక్రమానికి మండలం నుంచి భారీగా బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, నాయకులు వెంకటేష్‌గౌడ్, వడ్లమోనప్ప, ఓబులాపురం లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.



దామరగిద్ద నుంచి..

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం ఉమ్మడి పాలమూరు జిల్లా కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ హాజరైన కార్నర్ మీటింగ్ తరలివెళ్లారు. అన్ని గ్రామాల నుంచి నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

మొక్కల సంరక్షణపై దృష్టి



మస్తీపురంలో మొక్కలకు నీటిని అందిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

అమరచింత: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మస్తీపురంలో చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలకు నీటిని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి కాకుండా వాటి పాదుల వద్ద చెత్తచెదారం తొలగించాలని సూచించారు. మొక్కలకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిచాలని ఆదేశించారు. ప్రార్థన మందిరాలు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణంలో నాటిక మొక్కలు ఎండుముఖం పట్టకుండా వాటిని కాపాడాల్సిన అవసరం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు.

'మతపరమైన వ్యాఖ్యలు తగవు'

అమరచింత: ముస్లింలపై మతపరమైన అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రధాని మోదీపై అనర్హత వేటు వేయాలంటూ శుక్రవారం పట్టణంలో ముస్లిం జేసీసీ ఆధ్వర్యంలో తహసీల్దార్, పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రధాని మోదీపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ చాంద్‌పాషా, ఎస్ఐ సురేష్‌కుమార్‌కు వినతిపత్రాలు అందించారు. ఈసందర్భంగా నాయకులు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ ఏప్రిల్ 21 ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ వస్తే ప్రజల సంపదను ముస్లింలకు పంచుతుందని, అలాగే మహిళల మంగళసూత్రాలు, ఆస్తులు కూడా వదలరని, జప్తు చేసుకుంటారని ప్రసంగించడం ముస్లిం మనోభావాలను కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. దేశానికి ప్రధానిగా ఉన్న మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి హిందూ, ముస్లింలను విభజించి ఓట్ల రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తౌఫిక్, అలీషేక్, పాషా, నసీర్, నబీ, ఆశు పాల్గొన్నారు.